
ప్రజాశక్తి

మంగళవారం 5 డిసెంబర్ 2023



9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాసంస్థ కార్యదర్శి బిహెచ్‌వి లక్ష్మీకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో బ్యాంకులకు సంబంధించిన కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, సెక్షన్ 138 ఎన్ఐ యాక్టుకు సంబంధించిన కేసులు, ఎక్సైజ్ కేసులు, మేక్ట్ కేసులు, కుటుంబ వివాదాలు, కార్మిక సంబంధిత కేసులు, విద్యుత్, నీటి పన్నుకు సంబంధించిన కేసులు, భూ సేకరణకు సంబంధించిన కేసులను పరిష్కరించుకోవచ్చని సూచించారు. పూల్‌బాగ్ కాలనీ హనుమాన్ నగర్‌లోని ఎంఆర్‌విఆర్‌జిఆర్‌పిజి బాయ్స్ హాస్టల్ ప్రాంగణంలోని నూతన కోర్టు భవనంలో ఆరోజు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని లక్ష్మీకుమారి కోరారు.



చింతపల్లి తీరంలో ఎర్రజెండా ఎగురవేస్తున్న అధికారి

తీరంలో రెడ్ అలెర్ట్

పూసపాటిరేగ : బంగాళాఖాతంలో తుపాను ప్రభావంతో తీరంలో అలలు ఎగిసి పడుతున్నాయి. మిచౌంగ్ ప్రభావంతో తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి ఈదురుగాలులుతో కూడిన వర్షం పడడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు. తీర గ్రామాల్లో సముద్రం ఒడ్డున ఎర్రజెండాలు ఎగురవేశారు. తుపాను ముప్పు పొంచి ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సముద్రంలో లంగరు వేసిన బోట్లు వెంటనే బయటకు తీసుకువచ్చేలా చర్యలు చేపట్టారు. తీరం ఒడ్డున కూడా బోట్లు దూరంగా పెట్టుకోవాలని అధికారులు సూచించారు. మంగళవారం తుపాను తీరం దాటే అవకాశం ఉందని, దాని ప్రభావం తీరంపై ఉంటుందని తెలిపారు. తహశీల్దార్ భాస్కరరావుతోపాటు రెవెన్యూ అధికారులంతా తీరంలో మకాం వేశారు. మత్స్యకార నాయకులతో సమావేశమై, సూచనలు చేశారు. భారీవర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఇప్పటికే లోతట్టు ప్రాంతాలను గుర్తించారు. ఎక్కడ, ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వంగర.. వరిచేను కుప్పలపై టార్పాలిన్లు కప్పుతున్న రైతు



కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

జిల్లాలో తుపాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు కలెక్టర్ కార్యాలయంతోపాటు, డివిజన్ స్థాయిల్లో ఇరవై నాలుగు గంటలూ పనిచేసేలా కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. తుపానుతో ఎక్కడ నష్టాలు సంభవించినా కంట్రోల్‌రూంకు తెలియజేయవచ్చన్నారు. మంగళవారం తుపాను తీరాన్ని దాటే అవకాశం వున్నందున జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురవడంతోపాటు పెనుగాలులు వీచే అవకాశం వుందని, ప్రజలు అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ సూచించారు.

జిల్లా కలెక్టర్ కార్యాలయ కంట్రోల్ రూమ్ : 08922 - 236947

ఆర్‌డిఒ కార్యాలయం : 0892- 276888

చీపురుపల్లి : 9121735703, బొబ్బిలి : 6302554425

జిల్లాలో సోమవారం ఉదయం 8.30 నుంచి రాత్రి 7 గంటల వరకు కురిసిన వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీ)
పూసపాటిరేగ	23.8
కొత్తవలస	16.2
వేపాడ	16
భోగాపురం	15.6
విజయనగరం	14.8
గుర్ల	14.2
గంట్యాడ	14
బొండపల్లి	12.8
లక్కవరపుకోట	12.8
జామి	10.4
గజపతినగరం	9.4
శృంగవరపుకోట	8.6
చీపురుపల్లి	7.4
మెంటాడ	7
గరివిడి	6.2
రేగిడి	5.8
సంతకవిటి	5
రామభద్రపురం	5
నెల్లిమర్ల	4.4
దత్తిరాజేరు	4.4
రాజాం	4
మెరకముడిదాం	3.8
తెర్లాం	3.6
బొబ్బిలి	3.4
డెంకాడ	3.2
బాడంగి	2.8
వంగర	2.6

వణికిస్తున్న తుపాను

- జిల్లా అంతటా వర్షాలు
- చలిగాలులతో వృద్ధులు, పిల్లలకు అవస్థలు

ప్రజాశక్తి-విజయనగరం

తుపాను నేపథ్యంలో సోమవారం తెల్లవారు జాము నుంచి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. విజయనగరం జిల్లాలో ఓ మోస్తారు వర్షాలు కురవగా, ఏజెన్సీలో చిరు జల్లులు పడ్డాయి. చల్లని గాలులతో చలి తీవ్రత పెరిగింది. మరోవైపు తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులంతా తమ వరిపంటను పొలాల్లోను, కళ్లాల్లోనూ దిబ్బలుగా పెట్టినప్పటికీ వర్షాలకు తడిచిపోయి రంగు మారుతాయని ఆందోళన చెందుతున్నారు. మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో మరింత ఆందోళన పెరిగింది. ఈనేపథ్యంలోనే ఇప్పటికే మట్టించి కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని పార్వతీపురం మన్యం జిల్లాలో అధికారులు మిల్లులకు, సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. విజయనగరం జిల్లాలోనూ అటువంటి చర్యలకు కలెక్టర్ ఆదేశించారు.

యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు : జెసి

తుపాను నేపథ్యంలో నూర్పిడి చేసిన రైతుల వద్ద నుంచి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే చాలామంది రైతులు తమ ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలకు తరలించారన్నారు. సోమవారం రైతుభరోసా కేంద్రాల పరిధిలో సుమారు వంద టన్నుల వరకు ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. మరొక 1000 టన్నులు మంగళవారం కొనుగోలు చేస్తామన్నారు.



బొబ్బిలి మండలం మెట్టవలస గ్రామంలో వర్షంలో పత్తి ఏరుతున్న రైతులు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక, జెసి అశోక్

పంటనష్టం వాటిల్లొద్దు

- రైతుల వద్ద ధాన్యం తక్షణం కొనుగోలు చేయాలి
- తుపాను కారణంగా ప్రాణనష్టం లేకుండా చూడాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి-విజయనగరం

బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుపాను తీరం వైపు దూసుకువస్తున్న దృష్ట్యా కోస్తా జిల్లాల్లో ప్రాణనష్టం జరగకుండా ఆయా జిల్లా కలెక్టర్‌లు అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశించారు. వ్యక్తులతో పాటు పశువుల ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. మంగళవారం ఉదయం మించౌంగ్ తుపాను బాపట్ల వద్ద తీరం దాటే అవకాశం వుందని తుపాను హెచ్చరికల కేంద్రం సూచనలు చేస్తున్న దష్ట్యా కోస్తా ప్రాంతంలోని అన్ని జిల్లాల కలెక్టర్‌లు అప్రమత్తంగా వుంటూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుఫాను సహాయక చర్యలపై ముఖ్యమంత్రి సోమవారం జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు.

తుపాను దృష్ట్యా రైతులకు పంటనష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటివరకూ కోతలు చేపట్టని పక్షంలో కోతలు పూర్తిచేయకుండా వారికి సూచించాలని, కోతలు పూర్తయిన పక్షంలో రైతుల వద్ద వున్న ధాన్యం తక్షణమే కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుఫాను ప్రభావం తగ్గిన వెంటనే పంటనష్టం అంచనాలు వేసి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. తుపాను నష్టం త్వరగా అంచనా వేయడంలో వలంటీర్ల వ్యవస్థను సమర్థంగా వినియోగించుకోవాలన్నారు.

వీడియో కాన్ఫరెన్సులో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక పాటిల్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిజాస్టర్ మేనేజర్ అథారిటీ డిపిఎం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



భోగాపురం.. బోటును ఒడ్డుకు చేర్చుతున్న మత్స్యకారులు



బొబ్బిలిరూరల్.. వరిచేను కుప్పలపై కప్పిన టార్పాలిన్లు

తీరప్రాంత గ్రామాల్లో తహశీల్దార్ పర్యటన

భోగాపురం : తుపాను తీవ్రతకు వర్షాలు పడుతుండడంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. తీర ప్రాంత గ్రామాల్లో తహశీల్దార్ చింతాడ బంగార్రాజు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా తోటపల్లి వద్దనున్న తుపాను షెల్టర్‌ను పరిశీలించారు. అవసరమైతే మత్స్యకారులను తరలించేందుకు ఏర్పాట్లను చేశారు. ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపలకంచేరు గ్రామాల్లో ఆయన పర్యటించి తుపాను తీవ్రత గురించి వివరించారు. తీవ్రత ఎక్కువగా ఉంటే షెల్టర్‌కు తరలిరావాలని మత్స్యకారులకు సూచించారు. తీరప్రాంత గ్రామాల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాలని ఆర్ఐ కిషోర్‌కు సూచించారు. ఇప్పటికే మత్స్యకారులు తమ బోట్లను తీరానికి దూరంగా చేర్చి వలలను భద్రపరచుకున్నారు. సోమవారం ఉదయం నుంచి మండల వ్యాప్తంగా వర్షాలు ప్రారంభమయ్యాయి. రైతులు కోసిన వరిచేనును పొలాల్లోని గాలి దిబ్బలు వేసి ఉంచారు.

నేడు పాఠశాలలకు సెలవు

విజయనగరం టౌన్ : మిచౌంగ్ తుపాను కారణంగా సోమవారం మధ్యాహ్నం, మంగళవారం పాఠశాలలకు జిల్లా విద్యా శాఖ అధికారి బి.లింగేశ్వరరెడ్డి సెలవు ప్రకటించారు. తుపాను ప్రభావం మంగళవారం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో సెలవు ప్రకటించినట్లు వివరించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



మత్స్యకారులతో మాట్లాడుతున్న తహశీల్దార్ బంగార్రాజు

సమస్యల పరిష్కారానికి

కదంతొక్కిన సమగ్రశిక్ష ఉద్యోగులు




డిఇఒ లింగేశ్వరరెడ్డితో మాట్లాడుతున్న జెఎసి నాయకులు

కలెక్టరేట్ వద్ద ధర్నా, రాస్తారోకో

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, తక్షణమే గ్రాస్ పే అమలు చేయాలని, ఇతర ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు.

సమగ్ర శిక్ష పరిదిలో మండల విద్యాశాఖ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిఆర్‌ఎంటిలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐ ఎస్ కోర్డినేటర్లు, మండల లెవెల్ అకౌంటెంట్లు, మెసెంజర్లు, సహిత విద్యా రిసోర్స్ పర్సన్లు , భవిత, ఫిజియో థెరపిస్టులు, పాఠశాలల్లో పనిచేస్తున్న ఆర్ట్, కాఫ్ట్, పి.ఈ.టి పార్ట్ టైం టీచర్లు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి.కాంతారావు మాట్లాడారు. సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, అందరికీ మినియం ఆఫ్ టైం స్కేల్‌అమలు చేసి, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఔట్సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోని మార్చి మినియం ఆఫ్ టైం స్కేల్ అమలు చేసి, వేతనాలు పెంచాలన్నారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దు చేసి, ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ గ్రాట్యుటీ 10 లక్షలు ఇవ్వాలన్నారు. సామాజిక భద్రత పథకాలు, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలి, మెరుగైన హెల్త్ స్కీం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీ పోస్టులను భర్తీ చేసి పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. డైలీ వైజ్, ఎంఇఒ కార్యాలయాల్లో టెంపరరీ లేదా స్టాఫ్ గ్యాప్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను కాంట్రాక్టు ద్ధతిలోనికి తీసుకోవాలనీ డిమాండ్ చేశారు.. మరణించిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలి, కారుణ్యనియమాలు చేపట్టాలని,మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు మంజరు చేయాలని, ప్రతి నెల ఒకటి తేదికి వేతనాలు చెల్లించాలని కోరారు. .అనంతరం డిఇఒ బి.లింగేశ్వర రెడ్డి ధర్నా వద్దకు వచ్చి ఉద్యోగులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ధర్నాలో నాయకులు కె.గురువులు, బి.రవీంద్రబాబు, రేజేటి కరుణాకర్, ఉమాశంకర్, ఆర్.శ్రీనివాసరావు, వై.శ్రీనివాసరావు, లక్ష్మి,కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

తుపాను పట్ల అప్రమత్తం

- రైతులు పంటలు కోతలు చేయవద్దు
- పేదలందరికీ ఇళ్లు లక్ష్యాలను పూర్తిచేయాలి
- 'ఆడుదాం ఆంధ్రా' రిజిస్ట్రేషన్లు వేగవంతం కావాలి
- వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

తీరం దాటే సమయంలో తుఫాన్ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, సోమవారం రాత్రి నుండి మంగళవారం రాత్రి వరకూ భారీ వర్షాలు గాలులు వీచే అవకాశం ఉంటుందని అధికారులంతా జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఎప్పటికప్పుడు తుపాను సమాచారాన్ని అందించాలని తెలిపారు. రైతులు ఇప్పటికే కోతలు కోసి ఉంటే పంట పై టార్పాలిన్ కప్పి ఉంచాలని తెలిపారు. నూర్పు చేసి ఉంటే ధాన్యాన్ని దగ్గరలోనున్న షెడ్స్ లోకి తరలించాలని, అందుకు అవసరమైన గన్నీ సంచులు సరఫరా చేస్తామని చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారి ఇళ్ల లోకి నీరు చేరకుండా చూడాలన్నారు.

సోమవారం మండల ప్రత్యేకాధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒ లు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులతో తుపాను జాగ్రత్తలు, గృహనిర్మాణాలు, ప్రయారిటీ భవనాల నిర్మాణాలు, ఆడుదాం ఆంధ్ర, గడప గడపకు మన ప్రభుత్వం, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాల పై సమీక్షించారు. పేదలందరికీ ఇళ్లు మెగా క్యాంపు కార్యక్రమానికి వారం వారం లక్ష్యాలను ఇచ్చామని, ఈ వారం లక్ష్యం 1155 వచ్చే 4 రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. ఇల్లు కట్టుకోడానికి ముందుకు రానివారికి నోటీసులు జారీ చేసి ఇంటిని రద్దు చేయడంతో పాటు మంజూరు చేసిన రుణాన్ని వెనక్కు తీసుకుంటామని చెప్పాలని, తహశీల్దార్ ద్వారా పట్టా రద్దు చేస్తామని నోటీసులు ఇవ్వాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం క్రింద మంజూరైన పనులు వేగంగా జరగాలని, పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని తెలిపారు. అయుష్మాన్ భారత్ కింద ఇకెవైసి చేయాలన్నారు.

జె.సి మయూర్ అశోక్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి ప్రతి సచివాలయం నుండి 228 ఆటగాళ్లను నమోదు చేయాలని, వారిలో సగం మంది మహిళలు ఉండాలని తెలిపారు. డిసెంబర్ 15 నుండి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, ఈ లోగా టీమ్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. మహిళా పోలీస్ ద్వారా మహిళా క్రీడలను నమోదు చేయాలని, వాలంటీర్లకు లక్ష్యాలను నిర్దేశించి, ప్రత్యేక కాంప్ ద్వారా నమోదు చేయాలన్నారు.

5 వాటర్ ఫిల్టర్లు వితరణ

ప్రజాశక్తి-విజయనగరం

కార్పొరేట్ సామాజిక బాధ్యతా కార్యక్రమంలో కరూర్ వైశ్యా బ్యాంకు ఐదు ఆల్ట్రా వాటర్ ఫిల్టర్లను సోమవారం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి అందజేసింది. మొత్తంగా సుమారు రూ.94,400 విలువ చేసే ఈ ఐదు ఫిల్టర్లలో నవోదయ పాఠశాలకు 3, అటవీశాఖ ఆధ్వర్యంలోని నగర వనానికి ఒకటి, చీపురుపల్లి బాలుర హాస్టల్‌కు ఒకటి కేటాయించారు. కార్యక్రమంలో సిపిఒ పి.బాలాజీ, ఎల్‌డిఎం ఎ.శ్రీనివాసరావు, నాబార్డు డిడిఎం నాగార్జున, కరూర్ వైశ్యాబ్యాంకు ఎజిఎం ఎన్.రమేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నైరెడ్ వార్షిక నివేదిక విడుదల

రాజాంకు చెందిన నైరెడ్ (నాగావళి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ ఎంటర్ ప్రెన్యువర్‌షిప్ డెవలప్‌మెంట్) 2022-23 వార్షిక కార్యక్రమాల నివేదికను కలెక్టర్ నాగలక్ష్మి ఆవిష్కరించారు. శిక్షణా కార్యక్రమాలను వేగవంతం చేసి, యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో, నైరెడ్ డైరెక్టర్ ఎం.రాజేష్, యుబిఐ డిప్యూటీ రీజనల్ హెడ్ టి.మాధురి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు 137 వినతులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి డిఆర్ఒ ఎస్.డి. అనిత ఆధ్వర్యంలో వినతులు స్వీకరించారు. డిఆర్‌ఒతోపాటు డిప్యూటీ కలెక్టర్లు బి.సుదర్శనదొర, కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ సుమబాల తదితరులు వినతులు స్వీకరించి, సంబంధిత అధికారులకు వాటి పరిష్కారం కోసం పంపించారు. జగనన్నకు చెబుదాంకు మొత్తం 137 వినతులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 103 వినతులు వచ్చాయి. వినతుల్లో కొన్ని...

విజయనగరం కార్పొరేషన్‌కు సంబంధించి ద్వారపూడి కొండపై గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సోలార్ పవర్‌ప్లాంట్‌ను పునరుద్ధరించాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్ వినతిపత్రం సమర్పించారు. కార్పొరేషన్‌కు ఆదాయం తెచ్చిపెట్టే సోలార్ ప్లాంట్‌ను వైసిపి అధికారంలోకి వచ్చాక నిర్వీర్యం చేశారని వారు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బి.నర్సింగరావు, నాయకులు పైడిరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డిఆర్‌ఒకు సమస్యను వివరిస్తున్న జనసేన నాయకురాలు మాధవి

పూసపాటిరేగ మండలం అల్లాడపాలెంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని జనసేన నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి లోకం మాధవి వినతి అందించారు. జనావాసాల మధ్య ప్రభుత్వ మద్యం షాపును ఎలా ఏర్పాటుచేశారని ప్రశ్నించారు.

విజయనగరంలోని 19వ డివిజన్ పరిధిలో ఉన్న బంగారమ్మకాలనీలో 2009లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, పట్టాలిచ్చారని, ఆర్థిక స్తోమత లేక వారు నిర్మాణాలు చేపట్టలేదని, వారికి ఇళ్లు మంజూరు చేయాలని మహిళా మోర్చా నార్త్‌జోన్ అధ్యక్షులు సోము రూప అర్జీ అందజేశారు. కార్యక్రమంలో ఇమంది సుదీర్, నాయకులు పాల్గొన్నారు.



పోలీసుస్టేషన్‌లో డిఐజి హరికృష్ణతో ఎస్‌పి, డిఎస్‌పి , సిఐ, ఎస్‌ఐలు

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డిఐజి

ప్రజాశక్తి-భోగాపురం

స్థానిక పోలీస్ స్టేషన్‌ను విశాఖ రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా నమోదైన కేసులకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కన్నా ప్రస్తుతం ఎఒబి లో మావోయిస్టుల కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయని అన్నారు. ఎస్‌పి దీపిక పాటిల్, డిఎస్‌పి గోవిందరావు, సిఐ బివి వెంకటేశ్వరరావు, ఎస్‌ఐలు కృష్ణమూర్తి, సూర్య కుమారి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి పోటెత్తిన జనం

ప్రజాశక్తి-వేపాడ

కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా జిల్లాలోని శివాలయాలు కిటకిటలాడాయి. ఆలయాలకు భారీగా యాత్రికులు తరలివచ్చారు. వేపాడ మండలంలోని బానాది, కొండగుల్ల శివాలయాలకు తెల్లవారుజాము నుంచే యాత్రికులు చేరుకుని, పూజలు చేశారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-వేపాడ

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ సచివాలయ సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని పాటూరు సచివాలయ సిబ్బందితో ఎంపిడిఒ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో సచివాలయ పరిధిలో 300 వరకు రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శి సంధ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు మోటారు సైకిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం వన్ టౌన్, రూరల్, జామి పోలీసు స్టేషన్ల పరిధిలో చోరీకి గురైన ఐదు మోటారు సైకిళ్లను రికవరీ చేసినట్లు వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు తెలిపారు. ఈ కేసులో ఓ బాలుడిని అదుపులోకి తీసుకొని, విచారణ చేపట్టామన్నారు. విచారణలో ఇచ్చిన సమాచారం మేరకు విజయనగరం పట్టణంలో చోరికి గురైన మూడు మోటారు సైకిళ్లు, జామి స్టేషను పరిధిలో చోరీకి గురైన ఒక మోటారు సైకిలును, విజయనగరం రూరల్ పరిధిలో చోరీకి గురైన మరో మోటారు సైకిలును రికవరీ చేశామని తెలిపారు. మోటారు సైకిళ్లను రికవరీ చేయడంలో క్రియాశీలకంగా పని చేసిన అధికారులను, సిబ్బందిని సిఐ అభినందించారు.

ఫొటో, పెయింటింగ్ పోటీలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఛాయాచిత్ర, పెయింటింగ్ పోటీలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ సన్నీడయోల్, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ రమణారావు, డాక్టర్ శ్రావణి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని రావాడ సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలనే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి సంక్షేమ పథకాల బోర్డును, పథకాల బ్రోచర్‌ను, వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అప్పరభుక్త పైడినాయుడు, మాజీ సర్పంచ్ వాసుబాబు, కొమ్ము సీతంనాయుడు, నరిసింగ్ రావు, వార్డు మెంబర్లు, గృహ సారదులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న జెసి రాజు

జెసి రాజుకు పురస్కారం

ప్రజాశక్తి-బొబ్బిలి

విజయవాడలో హనుమంతరాయ్ గ్రంథాలయంలో ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ, డాక్టర్ బ్రహ్మదేశం సామాజిక సేవా సొసైటీ సంయుక్త ఆధ్వర్యాన కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజుకు డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయిలో వివిధ రంగాలలో ఉత్తమమైన సేవలందించిన వారికి కలాం స్ఫూర్తి పురస్కారాలను అందించారు. ఈ నేపథ్యంలో 22 సంవత్సరాలుగా వివిధ సేవలు అందిస్తున్న బొబ్బిలి పట్టణానికి చెందిన జెసి రాజుకు పురస్కారాన్ని ప్రదానం చేశారు.

సంగమేశ్వర ఆలయాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - వంగర

మండలంలోని సంగాంలో గల సంగమేశ్వర ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని స్పీకరు తమ్మినేని సీతారాం అన్నారు. ఆయన కుటుంబ సమేతంగా సంగమేశ్వర ఆలయాన్ని సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సిద్ధాంతం గణపతితో పాటు చైర్మన్ బోను నాగరాజు, వైసిపి నాయకులు గేదెల రామకృష్ణ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని విలేకర్లతో మాట్లాడుతూ ద్వాపర యుగం నుంచి ఈ ఆలయానికి యాత్రికుల తాకిడి భారీగా ఉండటం గొప్ప విషయమన్నారు. అలాంటి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి. ఐజాక్, ఆర్ఐ జామి మురళి తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులు

చల్లని గాలులు.. చిరుజల్లులు

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

తుపాను ప్రభావంతో బొబ్బిలిలో చల్లని గాలులు వీచాయి. చిరుజల్లులు కురిశాయి. చల్లని గాలులతో చలి తీవ్రత పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు పొలాల్లో ఉన్న వరిచేలను కాపాడుకునేందుకు రైతులంతా అప్రమత్తమయ్యారు. కోసి ఉంచిన వరిచేలను దిబ్బలుగా పెట్టి టార్పిలిన్లు కప్పారు.

లక్కవరపుకోటలో తేలికపాటి వర్షం

లక్కవరపుకోట : మండలంలో సోమవారం ఉదయం నుంచి తేలికపాటి వర్షం కురిసింది. పండిన పంట చేతికి వచ్చే సమయంలో తుపాను కారణంగా కురుస్తున్న వర్షం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కోసిన వరిచేనును సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మండల వ్యవసాయశాఖ అధికారి స్వాతి రైతులకు సూచించారు. భారీవర్షాల నేపథ్యంలో మండలంలో పాఠశాలలకు సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం వరకు సెలవు ప్రకటించినట్లు ఎంఇఒ సిహెచ్.కూర్మారావు తెలిపారు.

రైతులు అప్రమత్తం

వంగర : మిచౌంగ్ తుపాను ప్రభావంతో మండలంలో సోమవారం ఉదయం నుంచి తేలికపాటి వర్షపు జల్లులు కురిసాయి. వివిధ గ్రామాలలో ఇప్పటికే వరి



బొబ్బిలిలో వరిచేలను కుప్పలుగా పెడుతున్న రైతులు

చేలు కోతలు కోసిన రైతులు తమ పంటలు తుపాను ముప్పుతో పాడైపోతాయేమోనని అప్రమత్తమయ్యారు. వరి చేను కాపాడుకునేందుకు రైతులు టార్పెయిన్‌లను కుప్పలపై కప్పుతున్నారు. ఈ తుపాను మంగళవారానికి ఎక్కువయ్యే అవకాశం ఉన్నందున రైతులు ఆందోళన చెందుతున్న పరిస్థితి నెలకొంది.

కొత్త కోర్టు భవనంలో పోస్టాఫీసు ప్రారంభం

ప్రజాశక్తి-విజయ నగరం లీగల్

కక్షి దారులకు అందరికీ అందుబాటులో వుండేలా కొత్త కోర్టు భవన సముదాయంలో పోస్టాఫీసును జిల్లా జడ్జి బి.సాయి కళ్యాణ చక్రవర్తి సోమ వారం ప్రారంభించారు. ఇటీవల కాలంలో విటి అగ్రహారంలో వున్న జిల్లా కోర్టు భవన సముదాయాన్ని ఫూల్‌బాగ్ ఎంఆర్ పిజి హాస్టల్ భవనంలోకి మార్చిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో కొద్ది రోజులుగా పోస్టల్ సేవలు నిలిచిపోయాయి. జిల్లా జడ్జి చొరవ తీసుకుని పోస్టల్ శాఖ ఉన్నత అధికారుల తో సంప్రదించి పోస్టాఫీసు తరలిండానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. దీన్ని సోమ వారం జిల్లా జడ్జి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్టు జడ్జి ఎం.మీనాదేవి, పోస్టల్ శాఖ ఎఎస్‌పి పి.సుందర నాయుడు, పిఆర్‌పి శంకర నాయుడు, న్యాయ వాదుల సంఘ అధ్యక్షుడు సిహెచ్ దామోదరరావు, న్యాయ వాదులు పి.హర గోపాల్, కె.కృష్ణమూర్తి, ఆర్.వాసన్, పి.మౌనిక, షేక్ హుస్సేన్, కోర్టు మేనేజర్ బివిఎస్ నాయుడు, సూపరింటెండెంట్ కె.అప్పలనాయుడు పాల్గొన్నారు.



పోస్టాఫీసును ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి



తిరుమల-మెడికవర్‌లో అరుదైన శస్త్రచికిత్స

100కు పైగా రాళ్లు తొలగింపు

ప్రజాశక్తి-విజయనగరం కోట

తిరుమల మెడికవర్ ఆసుపత్రిలో అత్యంత అరుదైన గాల్ బ్లాడర్ శస్త్రచికిత్స నిర్వహించినట్లు ఆస్పత్రి అధినేత డాక్టర్ కె.తిరుమల ప్రసాద్ వెల్లడించారు. సోమవారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం కోరాపుట్ ధమన్‌జోడికి చెందిన ఫూల్ కుమారి దేవి (69) తీవ్రమైన కడుపు నొప్పి, దీర్ఘకాలిక వ్యాధితో భాదపడుతూ గతనెల 29న హాస్పిటల్‌కు వచ్చారని తెలిపారు. స్కాన్ చేసి చూడగా ఆమెకు పిత్తాశయంలో రాళ్లుతో పాటు ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. కోత లేకుండా లాప్రోస్కోపిక్ ద్వారా శస్త్రచికిత్స విజయవంతంగా చేసినట్లు తెలిపారు. ఆ మహిళ పిత్తాశయంలో నుంచి 100కు పైగా రాళ్లు తీశామన్నారు. ఆపరేషన్ తర్వాత ఆమె పూర్తిగా కోలుకున్నార న్నారు. ఆమెకు కొంత కాలం క్రితం క్యాన్సర్ శస్త్ర చికిత్స, కీమోథెరపీ జరిగిన క్లిష్టమైన నేపథ్యంలో కూడా తిరుమల ప్రసాద్ శస్త్ర చేసినట్లు తెలిపారు. ఇటువంటి వ్యాధులు ఎక్కువగా కొవ్వు పదార్థాలు, ఆయిల్ ఎక్కువగా వాడడం, ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువ గా తినడం ద్వారా వస్తాయన్నారు. ఈసందర్భంగా ఐఎంఎ, విజయనగరం డాక్టర్లు డాక్టర్ తిరుమల ప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎఒ సిహెచ్.మహేష్, ఆస్పత్రి సెంటర్ హెడ్ పద్మకుమార్ పాల్గొన్నారు.

ఆశావర్కర్లు, సిహెచ్‌ఒల సమస్యలపై

11, 12న కలెక్టరేట్ వద్ద 36 గంటల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కనీస వేతనాలు చెల్లించాలని, పనిభారాన్ని తగ్గించాలని, ప్రభుత్వ సెలవులు, రిటైర్మెంట్, గ్రూపు ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఈనెల 11,12తేదీల్లో కలెక్టరేట్ వద్ద 36 గంటల పాటు నిరసన తెలుపుతామని ఆశావర్కర్ల యూనియన్ నాయకులు సోమవారం డిఎంహెచ్‌ఒ భాస్కరరావుకు వినతినిచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి మాట్లాడుతూ ఆశ వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, ఆన్‌లైన్‌లో రికార్డు వర్క్, మొబైల్ వర్క్ లాంటి ఒత్తిడితో పనిబారం పెరగడం వల్ల అనారోగ్యాలకు గువుతున్నారని తెలిపారు. కనీసం వేతనాలు లేకుండా సంక్షేమ పథకాలు సక్రముగా ఇవ్వకుండా, మెడికల్, మెటర్నిటీ సెలవులు అమలు చేయకుండా టిఎ, డిఎ ఇవ్వకుండా ఆశావర్కర్లతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటోందని తెలిపారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు.

డిఎంఅండ్‌హెచ్‌ఒకు ఆశా వర్కర్ల యూనియన్ వినతి



డిఎంహెచ్‌ఒకు వినతినిస్తున్న ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధారాణి

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మెడికల్ లీవులు, ప్రభుత్వ సెలవులు ఇవ్వాలని, పది లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ ను ఆశలుగా మార్చాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆశా వర్కర్లు డి.పద్మ, ఎ.శ్రీదేవి, ఎ.రాధ, ఎం.రాజేశ్వరి, పి.పైడిరాజు, ఐ.లక్ష్మి ప్రసన్న, బి.త్రివేణి, బి.పైడిరాజు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 33 అర్జీలు

ప్రజాశక్తి-విజయనగరం

ఎస్‌పి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 33 అర్జీలు అందాయి. అర్జీలు స్వీకరించిన ఎస్‌పి దీపిక.. వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, చట్ట పరిధిలో న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. తీసుకున్న చర్యలను ఎస్‌పి కార్యాలయానికి పంపాలని సూచించారు. అర్జీల్లో కొన్ని...

సంతకవిటికి చెందిన ఒక వ్యక్తి తమ కుటుంబ ఆస్తులను పెద్దల సమక్షంలో పంచుకొన్నామని, తల్లి పోషణార్థం మినహాయించిన భూమిని ఒక్కరే తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, న్యాయం చేయాలని ఎస్‌పికి ఫిర్యాదుచేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్‌పి.. విచారణ చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని రాజాం రూరల్ సిఐను ఆదేశించారు.

విజయనగరం నగరానికి చెందిన ఒకామె తన భర్త 2016లో మరణించారని, ఆస్తి విషయమై భర్త బంధువులు వేధింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదుచేశారు. ఎస్‌పి స్పందిస్తూ విచారణ చేపట్టి, ఇరువురికి కౌన్సిలింగ్ చేయాలని, ఫిర్యాదికి న్యాయం చేయాలని దిశ సిఐను ఆదేశించారు.

గజపతినగరం మండలం వెంకటాపురానికి చెందిన ఒక వ్యక్తి.. తన కుమారుడు, కోడలితో ఆస్తి విషయమై తగాదాలు ఉన్నాయని ఎస్‌పికి ఫిర్యాదుచేశారు. వైద్య అవసరాల నిమిత్తం తన ఆస్తులను అమ్మేందుకు ప్రయత్నించగా, వాటిని అమ్మకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దౌర్జన్యానికి పాల్పడుతున్నారని



బాధితుల సమస్యలు వింటున్న ఎస్‌పి దీపిక, ఎఎస్‌పి, డిఎస్‌పి

వాపోయారు. సదరు ఆస్తులను వారి పేరున రాయాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్‌పి విచారణ చేపట్టి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని, రెవెన్యూ అధికారులను సంప్రదించి, ఫిర్యాదికి న్యాయం చేయాలని గజపతినగరం సిఐను ఆదేశించారు.

విజయనగరం మండలం కోరాడపేటకు చెందిన ఒక వ్యక్తి విశాఖపట్నానికి చెందిన ఒక వ్యక్తి స్థలం అమ్ముతామని నమ్మించి, రూ.లక్ష అడ్వాన్సుగా తీసుకుని, నేటికీ భూమిని విక్రయించలేదని, అడ్వాన్సు నగదును తిరిగి ఇవ్వడం లేదని ఫిర్యాదుచేశారు. విచారణ చేపట్టి, చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని వన్‌టౌన్ సిఐను ఆదేశించారు.

డెంకాడ మండలం గొలగాం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఎస్‌పికి ఫిర్యాదు చేస్తూ ఆస్తుల విషయమై తన సోదరుడితో వివాదం ఉందని, ఇటీవల తాను నాటిన మొక్కలను, పునాదులను తన సోదరుడు జెసిబితో తొలగించేశారని, న్యాయం చేయాలని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్‌పి చర్యలు తీసుకోవాలని డెంకాడ ఎస్ఐను ఆదేశించారు.

తెర్లాం మండలం లోచర్లకు చెందిన ఒకామె 2011లో తనకు వివాహమైందని, కుమారుడు జన్మించిన తరువాత తన భర్త వేరే మహిళతో ఉంటూ, తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదుచేశారు. ఎస్‌పి స్పందించి విచారణ చేపట్టి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని దిశ డిఎస్‌పిని ఆదేశించారు.

కార్యక్రమంలో అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, దిశ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, ట్రెయినీ డిఎస్‌పి ఎస్.మహేంద్ర, డిసిఆర్‌బి సిఐ జె.మురళి, ఎస్‌బి సిఐ నర్సింహ మూర్తి, డిసిఆర్‌బి ఎస్ఐలు వాసుదేవ్, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రామ్మోహన్ ప్రభుత్వాన్ని కోరారు. బొబ్బిలిలో ఎస్ఎఫ్ఐ మండల మహాసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో హాస్టల్ విద్యార్థుల సమస్యలపై, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలని ఎన్నో పోరాటాలు చేసినట్లు గుర్తుచేశారు. ఆ స్ఫూర్తిని రానున్న కాలంలో కొనసాగిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల ప్రభుత్వ విద్యాసంస్థల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. డిగ్రీలో తీసుకొచ్చిన జాయింట్ అకౌంట్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. నెల్లిమర్లలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మణికుమార్; కిరణ్, గర్ల్స్ కన్వీనర్‌గా దీపారాణి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి వాసు, తదితరులు పాల్గొన్నారు.

ఐడిఎస్ఎంటి షాపులు తెరవొద్దు : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మిచౌంగ్ తుపాను నేపథ్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలో ఉన్న ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న దుకాణాలు మంగళవారం తెరవవద్దని కమిషనర్ ఆర్ శ్రీరాములు నాయుడు సూచించారు. తుపాను కారణంగా భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో ఐడిఎస్ఎంటి కాంప్లెక్స్‌కు ఇబ్బందులు ఏర్పడవచ్చున్న ముందస్తు ఆలోచనతో జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. గతంలో కురిసిన వర్షాలకు షాపింగ్ కాంప్లెక్స్ గోడ కూలిన సంఘటన పరిగణలోకి తీసుకోవాలని అన్నారు.

నాలుగో రోజూ అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మెకు సన్నద్ధమవుతున్న అంగన్‌వాడీలు నాలుగో రోజు సోమవారం కూడా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడ్రాజు, ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు శివలక్ష్మి, విశాలాక్షి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కారం చేయాలని, ముఖ్యమంత్రి అంగన్వాడీ లకు ఇచ్చిన హామీ లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 8 తేదీ నుంచి చేపట్టనున్న సమ్మెలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కారం చేసి సమ్మె జరగకుండా చూడాలన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కారం చేయకుంటే సమ్మె కొనసాగుతుందని తర్వాత పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నిరసన కార్యక్రమం లో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్



నెల్లిమర్ల : సచివాలయ సిబ్బందికి సమ్మె నోటీసు ఇస్తున్న అంగన్‌వాడీలు

(సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా 4వ రోజు అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు నల్ల రిబ్బన్లతో విధులకు హాజరయ్యారని యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు మంగ లక్ష్మి , సెక్టార్ నాయకులు ఈశ్వరమ్మ, జయ, పైడి రాజు తెలిపారు. కొండవెలగాడ, సచివాలయం కార్యదర్శులకు సమ్మె నోటీసు అందించారు. ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

రైతులను ఆదుకోవాలి

నెల్లిమర్ల : తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఇటీవల అకాల వర్షాలు కురిసి వరి పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. తాజాగా తుపానుతో మరింత నష్టం వాటిల్లుతోందన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం నష్టపోయిన రైతులకు రుణాలు రద్దు చేసి ఆదుకోవాలని అవసరమైన విత్తనాలు అందించి తిరిగి వ్యవసాయ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికార్లు తడిసిన వరి పంటను పరిశీలించి లంచనాలు వేయాలని కోరారు.

శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం

టైలరింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వర్క్, బ్యూటిషియన్ కోర్సు, డేటా ఎంట్రీ ఆపరేటర్, జూనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వంటి స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు సెట్విజ్ కార్యాలయంలో ఈనెల 10లోగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 99491 74809 నంబరును సంప్రదించాలని కోరారు.

జనసేనలో చేరికలు

పూసపాటిరేగ : మండలంలోని రెల్లివలసకు చెందిన పలువురు జనసేన పార్టీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు లోకం మాధవి తెలిపారు. వైసిపి పాలనతో విసిగిపోయిన వారు జనసేనలోకి రావాలని ఆమె కోరారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి అనేక మంది తమ పార్టీలో చేరుతున్నారన్నారు.